నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు పనుల కారణంగా ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధి విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ విష్ణు వర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు..

పీఅండ్‌టీ కాలనీ కౌంటర్, కమ్యూనిటీ హాల్, చౌరస్తా, కోదండరామ్ నగర్ హనుమాన్ టెంపుల్, వీవీనగర్, శారద నగర్, లాలజార్ లేన్, షోయబ్ మెమోరియల్ పార్క్, వాకీ గ్రౌండ్, వాలీబాల్ గ్రౌండ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, గుల్జార్ మజీద్ పరిసర ప్రాంతాలు

మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు..

జీఏ బ్యాంక్ కాలనీ, త్రివేణి నగర్, వీకే ఢాగేన గర్, అక్బర్ టవర్, పూల్‌బాగ్, నల్గొండ క్రాస్ రోడ్, పెట్రోల్‌బంక్ బ్యాక్‌సైడ్. కాలడేరా ఫుట్ బాల్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

నాగోలు: కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సయమారాధన, హనుమద్వాహనంపై కోదండరామ స్వామి అవతారంలో వేంకటేశ్వర స్వామి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవాలయంలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



సాయికుమార్

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గం కొత్తపేట ప్రాంతానికి చెందిన కొన్నోజు సాయికుమార్‌కు డాక్టరేట్ వరించింది. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం నుంచి ఇంజినీరింగ్ విభాగంలో సివిల్ డిపార్ట్‌మెంట్‌లో స్టడీస్ ఆన్ జియోపాలియర్ కాంక్రీట్ యుటిలైజేషన్ ఆఫ్ ఎగ్ షెల్ పౌడర్ ఇంటిగ్రేటెడ్ విత్ సస్టైనబుల్ మెటీరియల్స్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ వచ్చినట్లు తెలిపారు. సాయికుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

నివాళి



రావినారాయణరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎల్‌బీనగర్: తెలంగాణ సాయుధ పోరాట వీరుడు రావినారాయణరెడ్డి జయంతి వేడుకలను హయత్‌నగర్ సీపీఐ మండల శాఖ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రావి నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్వాతంత్రం వచ్చిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ నుంచి రావి నారాయణరెడ్డి నెహ్రూ కన్నా ఎక్కువ మెజార్టీతో విజయం సాధించి చరిత్ర సృష్టించాడన్నారు. ప్రజాస్వామ్య విలువలు, ప్రజా సంక్షేమం, ప్రాజెక్టుల సాధనకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, అరుణ్‌కుమార్‌గౌడ్, మర్రి శోభన్, సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, సక్రునాయక్, మందుల కృష్ణ, సుజాత, సరిత, అరుణ, సౌజన్య, సుమతి, ఆదిలక్ష్మి, శివజ్యోతి, రాములు, జయంత్ పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

నాగోలు: ఒక సబ్జెక్టులో ఫెయిల్ అవ్వడంతో బీటెక్ ఫస్టియర్ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగోల్ బండ్లగూడలోని రాజీవ్ స్వగృహ డి–బ్లాక్‌లో నివాసం ఉంటున్న బీవీఎస్‌పి చౌదరి దంపతుల కుమారుడు అడ్డాల శ్రీదీప్(18) ఘట్‌కేసర్‌లోని కేపీఆర్ ఇంజినీరింగ్ కాలేజ్‌లో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. కాగా ఇటీవల ఫలితాలు ప్రకటించగా..ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీదీప్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో కేసు నమోదు చేసిన పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.



గీతానగర్ కాలనీలో విద్యుత్ వైర్ల అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు

గంటల తరబడి అంతరాయం

వివిధ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు బండ్లగూడలోని విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే అక్కడి సిబ్బంది కిందిస్థాయి సిబ్బందికి ఫోన్ నెంబర్ ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కసారి విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తితే గంటల తరబడి చీకట్లలోనే గడపాల్సిన దుస్థితి నెలకొంటోందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గాలి వీచినా.. చినుకులు కురిసినా కరెంట్ కట్

విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగజాతి మొక్కలు

తరచూ అంతరాయం | ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

నాగోలు: చిన్నపాటి గాలి వీచినా.. చినుకులు కురిసినా విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి గంటల కొద్ది బ్రేక్ డౌన్లతో సరఫరా నిలిచిపోతోంది. నాగోలు డివిజన్ పరిధి బండ్లగూడ ప్రాంతంలో వేసవిలో వచ్చిన చిన్న గాలి వానలనకే గంటలకు కొద్ది విద్యుత్‌కు అంతరాయం ఏర్పడేది. హైఓల్టేజీ సమస్యలు, చెట్ల కొమ్మలు తాకి పదే పదే ఫీడర్లు ట్రిప్పవడం, గాలివానలతో గంటల తరబడి బ్రేక్ డౌన్లు షరామాములే. విద్యుత్ సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో కాలనీ,బస్తీవాసులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



లలితనగర్‌లో..

ఎర్తింగ్ లేని స్తంభాలు..

బండ్లగూడ, ఆనంద్‌నగర్, గీతానగర్ కాలనీ, రాఘవేంద్రకాలనీ, లేక్‌వు హోమ్స్, పద్మావతి కాలనీ, సాయినగర్, లలితానగర్, శ్రీనివాస్‌నగర్ కాలనీ, విజయగార్డెన్ పరిసర ప్రాంత కాలనీ వాసులు నిత్యం విద్యుత్ సరఫరాతో ఇబ్బందులు పడుతున్నారు. త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో మా కాలనీల పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ స్తంభాలకు తీగజాతి మొక్కలు అల్లుకోవడంతో తరచూ విద్యుత్ ఆగిపోతుందని పేర్కొంటున్నారు. ఎర్తింగ్ లేని స్తంభాలు, డీటీఆర్‌లను తాకితే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంటుంది. వచ్చే వర్షం కాలం దృష్టిలో పెట్టుకొని విద్యుత్ అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసే దిశగా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



బండ్లగూడ లేక్‌వ్యూ హోమ్స్ వద్ద విద్యుత్ స్తంభానికి అల్లుకున్న చెట్ల తీగలు

బోధనా పద్ధతులను నవీకరించాలి

సైదాబాద్: మారుతున్న కాలనికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధన పద్ధతులను నవీకరించుకోవాలని సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ ఠాకూర్ సుఖ్‌దేవ్‌సింగ్ సూచించారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సైదాబాద్ మండల్ రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్స్ అసోషియేషన్ (ఎస్ఎంఆర్‌పీఎస్‌ఏ) ఆధ్వర్యంలో మండలంలోని 40 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీపై ట్రాన్స్‌ఫామింగ్ టీచర్స్ సమ్మిట్–2025 పేరిట ఏర్పాటు చేసిన వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు.ఈ వర్క్‌షాపులో ఉపాధ్యాయలకు జాతీయ విద్యా విధానం వివరాలపై అవగాహన పెంపొందిస్తారు. ఈ సందర్భంగా అసోషియేషన్ అధ్యక్షుడు ఎన్.వీరేంద్రబాబు యాదవ్ మాట్లాడుతూ.. తరగతి గదుల్లో పాఠ్యాంశాలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకునేలా ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సైంటిస్ట్ శేషసాయి, మెంటార్ ధర్మేంద్ర కుమార్, అసోషియేషన్ ప్రతినిధులు సాజిద్, సత్యం, మహ్మద్ సల్మాన్, అంకితారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరేంద్రబాబు యాదవ్

డిపో పరిశీలన

నాగోలు: ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్ బుధవారం నాగోలు పరిధిలోని బండ్లగూడ ఆర్టీసీ బస్సు డిపోను పరిశీలించారు. ఈ సందర్భంగా బండ్లగూడ ఆర్టీసీ బస్సు డిపో పరిధిలో అన్ని విభాగాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డిపో మేనేజర్ వెంకటేశం అసిస్టెంట్ మేనేజర్ ఇతర సిబ్బంది రాజశేఖర్‌ను సన్మానించారు.

రాచకాలువ పనులు ప్రారంభించాలి

ఎల్‌బీనగర్: అధికారుల అలసత్వం, సమన్వయలోపంతో రాచకాలువ పనులు నిలిచిపోయాయని బృందావన్ మెడోస్‌కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శశికాంత్ మాట్లాడారు. సర్వే నెంబర్ 72, 106లోని రాచకాలువను ఎప్పుడు బయటకు తీస్తారో అధికారులు తెలపాలని డిమాండ్ చేశారు. బృందావన్ మెడోస్ కాలనీలోని డ్రైనేజీ కనెక్టివిటీ పనులను వదిలివేసి మిగితా లైన్ పనులు చేపట్టడంపై మండిపడ్డారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి నివేదికను ఇచ్చినా డ్రైనేజీ కనెక్టివిటీ పనులు చేపట్టడంలో జలమండలి, సివరేజీ బోర్డు అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రాచకాలువ పనులు పూర్తయితే సుమారు 21 కాలనీలకు డ్రైనేజీ సమస్య తీరుతుందని ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.



తాగునీరు.. రోడ్డుపాలు

వనస్థలిపురం డివిజన్ పరిధి సాగర్ రహదారిపై వెంకటరమణ కాలనీ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద గత మూడ్రోజులుగా వాల్వ్ లీకేజీతో తాగునీరు రోడ్డుపై ఏరులై పారుతోంది. నీటి వృథాతో పాటు అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటివృథాను అరికట్టాలని కోరుతున్నారు. – వనస్థలిపురం

మైనార్టీల సంక్షేమానికి కృషి

మహేశ్వరం: మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహ్మద్ ఇర్షాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీబాబా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో దివంగత నేత, మాజీ సీఎం డా.వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మైనార్టీల అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు.

కల్తీపై కంట్రోలేదీ?

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్‌జోన్ పరిధిలోని మలక్‌పేట్, చాదర్‌ఘాట్, మాదన్నపేట్ ప్రాంతాల్లో కల్తీ వ్యాపారాలు జోరుగా కొనసాగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏళ్ల తరబడిగా సాగుతున్న ఈ వ్యాపారాలను సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో పోలీసులు స్పందిస్తున్నారు. ఇలాంటి అక్రమ దందాలపై ఇటీవల సైబరాబాద్ ఎస్‌వోటీ, చాదర్‌ఘాట్, సైదాబాద్ పోలీసులు దాడులు చేసి కొన్నింటికి చెక్ పెట్టగలిగారు. నిత్యం మన తినే శనగ పిండి, నూడుల్స్, నూనె, కోళ్ల దానా సాస్ యథేచ్ఛగా కల్తీ చేస్తూ జేబులు నింపుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిఘా లోపమే..

నకిలీ సరుకులకు గంజ్ కేరాఫ్‌గా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. నగరంలోనే పెద్ద మార్కెట్‌గా పేరొందిన మలక్‌పేట గంజ్‌లో తక్కువ ధరలకు వంట సామగ్రి, నిత్యావసరాలతోపాటు అన్ని రకాల వస్తువులు గంజ్‌లో లభిస్తుండటంతో నకిలీ సరుకు పంపిణీ విజృంభిస్తోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో కల్తీ పదార్థాలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు.సైదాబాద్, సరూర్‌నగర్, బాలాపూర్ మండలాల పరిధిలోని నిర్మానుష్య ప్రాంతాల్లో కల్తీ వ్యాపారాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సంబంధిత అధికారుల నిఘా లేకపోవడంతోనే ప్రమాదకర స్థితిలో మొక్కజొన్న వ్యర్థాలు, బఠానీలు, మూంగ్‌దాల్ లాంటి వాటితో శనగ పిండి, కల్తీ నూనెలు, సబ్బులు తయారు చేస్తున్నారు. అపరిశుభ్రమైన వాతావరణంలో నూడుల్స్ తయారీ బియ్యం, కిరోసిన్, ఇసుక కలిపి మరీ కోళ్ల దానా తయారు చేసి కోళ్లకు తినిపిస్తున్నారు. సంబంధిత అధికారులు ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి కల్తీ తయారీ, విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేయని రోడ్డుపై కార్పొరేటర్ గరం

సైదాబాద్: రహదారిని వేయకుండానే వేసినట్లు రికార్డుల్లో చూపి రూ. 10 లక్షలు స్వాహా చేసిన అధికారులు, కాంట్రాక్టర్ల అవినీతిపై జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి గళం విప్పారు. బుధవారం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఈ విషయమై ఆమె ప్రశ్నించగా స్పందించిన మేయర్ సదరు ఆరోపణలపై కమిషనర్‌ను వివరణ ఇవ్వాలని సూచించగా కమిషనర్ కర్ణన్ కౌన్సిల్‌లో సమాధానమిస్తూ ఐఎస్‌సదన్‌లో రహదారి విషయమై జరిగిన అవినీతిపై కార్పొరేటర్ తనకు ఫిర్యాదు చేసారని, వెంటనే తాము విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించామన్నారు. విజిలెన్స్ విచారణలో వేయాల్సిన రోడ్డుకు వేయకుండానే బిల్లులు మళ్లించిన విషయం నిజమేనని తేలిందని ఆయన వెల్లడించారు. వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ఇదే కాక డివిజన్‌లో పలు పనుల విషయంలో రూ. 2కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ వాటిపై విచారణ జరిపించాలని కార్పొరేటర్ కౌన్సిల్‌లో కోరారు.

7, 8 తేదీల్లో మార్కెట్‌కు సెలవు

చాదర్‌ఘాట్: హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు 7, 8 తేదీలో సెలవు దినమని మార్కెట్ ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 7న బక్రీద్, 8న మార్కెట్‌లో అమ్మవారి వార్షికోత్సవం, ఆదివారం నేపథ్యంలో సెలవులు ప్రకటించినట్లు ఎస్‌జీఎస్ తెలిపారు. సోమవారం యథావిధిగా క్రయ విక్రయాలు జరుగుతాయన్నారు.

కలుషిత నీరు సరఫరా కానివ్వొద్దు



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్‌లోని సాయినగర్, ఇందిరనగర్, పెద్దబజార్ ప్రాంతాల్లో వారం రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతుంది. సమస్యను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే బలాల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన వెంటనే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విజయవాడ జాతీయ రహదారిపై నీరు కలుషితం అవుతున్నట్లు గుర్తించి బుధవారం ఆండాళ్ నిలయం కమాన్ ఎదురుగా పైపులైన్‌కు మరమ్మతు చేపట్టారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వీలైనంత తొందరగా పనులు పూర్తి చేయాలని కలుషిత నీటి సరఫరా పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట డీజీఎం హస్మత్‌అలీ, ఏరియా మేనేజర్ ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధి

హస్తినాపురం: రాజకీయాలకు అతీతంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధి ఇంద్రప్రస్థకాలనీ ఫేజ్–1 కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి మంగళవారం రాత్రి ఆయన ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ మధుయాష్కీ గౌడ్, స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని మున్సిపల్ డివిజన్ల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రోజురోజుకు కొత్త కాలనీలు పెరగడంతో జనసాంద్రత ఎక్కువగా ఉంటుందని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీల్లో మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, గోపిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

6 నుంచి మహా కుంభాభిషేకం

చాదర్‌ఘాట్: మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లోని గరుడ అభయ ఆంజనేయస్వామి, లక్ష్మీ గణపతి సహిత శ్రీభవానీ శంకర సహిత నాగదేవత దేవాలయంలో ఈనెల 6, 7, 8వ తేదీలలో మహా కుంభాభిషేకం (సహస్ర ఘటాభిషేకం) కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవాలయం ఉత్సవ కమిటీ చైర్మన్ చేగూరి వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేవాలయం నిర్మించి 33 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బట్కిరి వివేకానంద్, దుగ్గు జగదీష్‌కుమార్, మాదారం కృష్ణ, బాలజీ, విశ్వం, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చేగూరి వెంకటరమణ

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

సైదాబాద్: భవనం పై నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం సైదాబాద్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని డాక్టర్ అబ్దుల్ ఖయ్యూంకు చెందిన నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి బుధవారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తి (40) కింద పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మద్యంమత్తులో భవనంపై నుంచి ప్రమాదవశాత్తు పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

మూసారంబాగ్ అభివృద్ధే లక్ష్యం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: మూసారంబాగ్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలో రూ.24 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కాలనీలు, బస్తీల్లో అంతర్గత రోడ్లను అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. చాలా కాలంగా అభివృద్ధికి నోచుకోని రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రాకపోకలకు అంతరాయం కలుగకుండా సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో జరుగుతున్న పైపులైన్ మరమ్మతు పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పూర్ణచందర్‌రావు, కృష్ణారావు, వెంకట్‌ప్రసాద్, యాదిగిరి సురేందర్, కమలాకర్ ఉన్నారు.

కార్మికులకు బెనిఫిట్స్ పెంచాలని వినతి

మలక్‌పేట: తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నేతలు బుధవారం నగరంలోని లేబర్ కార్యాలయంలో స్టేట్ లేబర్ బోర్డ్ సెక్రటరీ గంగాధర్‌ను కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు బ్యాగరి అనంతయ్య, గ్రేటర్ అధ్యక్షుడు యేర్పుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహేష్ గుర్తింపు కార్డులున్న కార్మికుల బెనిఫిట్స్ పెంచాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనంతయ్య మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు భద్రత గుర్తింపు కార్డు ఉండటంతో కార్మిక బోర్డ్ ద్వారా వచ్చే ప్రయోజనాలు పొందుతున్నారన్నారు. ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, సాధారణ మరణానికి రూ.3 లక్షలు, మ్యారేజ్ గిఫ్ట్ రూ. 2 లక్షలు, తదితర వాటిని పెంచాలని వినతిలో పేర్కొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు